
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 12 ఫిబ్రవరి 2025





గుణదల మేరీమాత ప్రార్థనా మందిరం వద్ద భక్తుల రద్దీ

● కల్యాణం.. కమనీయం



పెనుగంచిప్రోలులో గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణం కనుల పండువగా మంగళవారం రాత్రి జరిగింది. అమ్మవారి వంశీకుల తరపున కొల్లా వెంకట చంద్రమౌళి, ఉషా దంపతులు, గోపయ్య వంశీకుల తరపున కాకాని వెంకట శ్రీనివాసరావు - కృష్ణ వేణి దంపతులు పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు, పూజాద్రవ్యాలను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కల్యాణ తంతును ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు శివరాం బొట్ల ఆంజనేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

6లో

■ కొండంత విశ్వాసం



గుణదల మేరీమాత మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొండపైకి వెళ్లే మార్గాలన్నీ కిటకిటలాడాయి. కొండంత విశ్వాసంతో మరియమాతను స్మరిస్తూ భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు విదేశీయులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

6లో

బర్డ్‌ఫ్లూ భయం



పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్థకశాఖ వైద్యుడు

ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారణ

ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు అప్రమత్తం

- పొరుగు జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా జాగ్రత్తలు
- పదిరోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్న కృష్ణా కలెక్టర్ బాలాజీ
- పడిపోయిన చికెన్, కోడిగుడ్ల ధరలు, విక్రయాలు



బర్డ్‌ఫ్లూ భయం ఉమ్మడి కృష్ణాజిల్లాను వణికిస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆయా జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. పది రోజుల పాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం మాంసం దుకాణాలు, కోడి గుడ్ల వ్యాపారులపై పడింది. కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి. బర్డ్‌ఫ్లూ నుంచి కోళ్లను కాపాడుకునేందుకు పౌల్ట్రీఫామ్ యజమానులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

తగ్గిన కోడిమాంసం విక్రయాలు



ఉమ్మడి కృష్ణాజిల్లాలోని చికెన్ దుకాణాలకు కోళ్లు కంచికచర్ల, నందిగామ, నూజివీడు, ఏలూరు, నరసరావుపేటతోపాటు తెలంగాణ ప్రాంతాల నుంచి వస్తాయి. బర్డ్‌ఫ్లూ మాంసం వ్యాపారంలో భిన్న పరిస్థితులను చూపిస్తోంది. అమ్మకాలు తగ్గిపోయి వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతుంటే పౌల్ట్రీలు మాత్రం కోళ్ల ధరలను పెంచుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారుగా 2 వేల నుంచి 3 వేల వరకు కోడిమాంసం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో సీజన్‌లో రోజుకు 20 నుంచి 30 కోళ్లను కోస్తారు. అదే ఆదివారం రోజున 150 కోళ్ల వరకు కోస్తారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో రోజుకు పది కోళ్లకు మించి కోయలేక పోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం రోజున దారుణంగా 70 కోళ్లకు కోతలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడిమాంసం అమ్మకాలు తగ్గిపోవడంతో గుడ్డు ధరలు క్రమంగా పతనమవుతున్నాయి. కోడిగుడ్డు ధర కొద్దిరోజుల కిందటి వరకు ఏడు రూపాయలు పలికేది. ఇప్పుడు అది కాస్త ఐదు రూపాయలకు పడిపోయింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ: జిల్లాలోని చల్లపల్లి, మొవ్వ, మోపిదేవి, ఘంటసాల, పెదపారుపూడి తదితర ప్రాంతాల్లో పౌల్ట్రీఫామ్‌లు ఉన్నాయి. వీటిలో 36 లక్షల లేయర్, బ్రాయిలర్ కోళ్ల పెంపకాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ ఎన్‌సీహెచ్.నరసింహులు తెలిపారు. బర్డ్ ఫ్లూ సోకుతుందనే కారణంతో చికెన్, కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు, తినేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకినట్లుగా రుజువు కావడంతో జిల్లాపైనా ఈ ప్రభావం పడుతుందనే భయం పౌల్ట్రీ యాజమానులను వెంటాడుతోంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పౌల్ట్రీఫామ్‌లలో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో వీటి నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డీసీజెస్ ల్యాబ్‌కు పంపారు. అక్కడ నుంచి వచ్చిన నివేదికలో బర్డ్‌ఫ్లూగా నిర్ధారించారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లాకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కోళ్లు, కోడి గుడ్లు అధికంగా దిగుమతి అవుతూ ఉంటాయి. ఆ జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవద్దని, కోళ్లను, కోడిగుడ్లను రవాణా చేసే వాహనాలను కూడా జిల్లాలో ప్రవేశించకుండా నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ బాలాజీ మంగళవారం అధికారులను ఆదేశించారు. జిల్లాలోని

మిగతా 8లో..

విద్యార్థులతో విశ్వక్‌సేన్



వర్ధమాన సినీ నటుడు, 'లైలా' సినిమా హీరో విశ్వక్‌సేన్ జిల్లాలో మంగళవారం పర్యటించి సందడి చేశారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అభిమానులతో ముఖాముఖి మాట్లాడి సినీ విశేషాలను వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

- 10 నామినేషన్లు తిరస్కరణ
- 30 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల నామినేషన్ల పరిశీలన గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మంగళవారం పూర్తయ్యింది. మొత్తం 40 మంది అభ్యర్థులకు చెందిన 69 నామినేషన్లను అధికారులు పరిశీలించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. 30 మంది నామినేషన్లను ఆమోదిస్తున్నట్లు ఆర్‌వో నాగలక్ష్మి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ వి.కరుణ హాజరయ్యారు. కాగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. ఆ తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూపొందించి విడుదల చేస్తారు. ఆ వెంటనే బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రక్రియ చేపడతారు. నామినేషన్ల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, ఏఆర్‌వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

చెరువులో పడి రెండేళ్ల చిన్నారి మృతి

- బొల్లపాడు గ్రామంలో విషాదం

8లో

మామిడి రైతులకు మంచి రోజులు!

మార్చి కల్లా అందుబాటులోకి సీసీపీ!

ఇక విదేశాలకు మామిడి పల్ప్ ఎగుమతులు

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఏడాదిగా మూలనపడిన కోర్ ప్రాసెసింగ్ ప్లాంట్

కాంట్రాక్టు సంస్థను సాగనంపేందుకు ఏపీఐఐసీ చర్యలు

- కొత్త కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధం
- ప్లాంట్ పునరుద్ధరణకు కృషి చేస్తున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

మామిడి రైతులకు ఇక మంచి రోజులు రానున్నాయి. మల్లవల్లిలోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) యూనిట్ మార్చిలో అందుబాటులోకి రాబోతోంది. మామిడి సీజన్‌లో పల్ప్ ఎగుమతులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను ఏపీఐఐసీ అధికారులు చేపట్టారు. ఇదే జరిగితే ఈ మామిడి సీజన్‌లో రైతులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో ఏడాదిగా మూలనపడి ఉన్న కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను పునః ప్రారంభించేందుకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషి చేస్తున్నారు.



కోర్ ప్రాసెసింగ్ ప్లాంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ (ఐపీ)కు అనుబంధంగా ఉంటున్న మెగా ఫుడ్ పార్క్‌లోని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కామన్ అవసరాలైన పల్ప్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్ తదితరాలను తీర్చేందుకు వీలుగా సీపీసీని ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీపీసీని వివాదాస్పదం చేశారు. సీపీసీ లక్ష్యాన్ని నీరుగార్చేలా ఓ ఫ్లోర్ మిల్ యాజమాన్యానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఫ్లోర్ మిల్ యాజమాన్యం దీనిని సరిగా నిర్వహించకపోవటంతో పాటు బిల్లుల పేరుతో సీపీసీ కార్యకలాపాలనే నిలుపుదల చేసింది. కిందటేడాది మ్యాంగో పల్ప్ తీసి ఎగుమతులు చేయాలనుకున్న వ్యాపారులకు ఫ్లోర్ మిల్ యాజమాన్యం ఝలక్ ఇచ్చింది. ఆ తర్వాత పూర్తిగా ప్లాంట్ మూలన పడటంతో మెగా ఫుడ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. సీపీసీ పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా కొంత కాలంగా మల్లవల్లిపై దృష్టి సారించి పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సీపీసీని కూడా మార్చి నాటికి ఎట్టి పరిస్థితుల్లో

మిగతా 8లో..



కన్నుల పండువగా తిరుపతమ్మ కల్యాణం

» వైభవంగా పెద్ద తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ జ్యోతి స్థాపన చేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. శివాలయం అర్చకులు రేలంకి భాస్కర శర్మ, అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు తిరుముడి కార్యక్రమాలను ప్రారంభించారు.



అమ్మవారి మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న ప్రధాన అర్చకుడు

కల్యాణం.. కమనీయం



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ దంపతులు

గోపయ్య స్వామి సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మాఘ శుద్ధ పౌర్ణమి మంగళవారం రాత్రి శోభాయమానంగా జరిగింది. అమ్మవారి తరఫున కొల్లా వెంకట చంద్రమౌళి-ఉషా దంపతులు గోపయ్య స్వామి తరఫున కాకాని వెంకట శ్రీనివాసరావు - కృష్ణవేణి దంపతులు పట్టు వస్త్రాలు మంగళ సూత్రాలు, పూజాద్రవ్యాలను మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి కల్యాణ పీటలపై కూర్చున్నారు. తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలతో కల్యాణ వేదిక వద్దకు ఆలయ అధికారులు తీసుకువచ్చారు. కల్యాణ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు శివరాం బొట్ల ఆంజనేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీపీ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.ఎస్.కె అర్జునలు బందోబస్తును పర్యవేక్షించారు.

ధన్యులం.. లూర్ధు మాతా..



» భక్తులు హృదయ పరివర్తన పొందాలి..
» బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు
» ప్రశాంతంగా ముగిసిన గుణదల లూర్దు మాత మహోత్సవాలు

గుణదల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల గుణదల లూర్దుమాత మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గుణదల కొండపైకి వెళ్లే మార్గాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొండపైన తలనీలాలు సమర్పించడం, మరియమాత గుహ వద్ద కొవ్వొత్తులు వెలిగించడం, కొండ శిఖరాగ్రాన శిలువ చెంతన కొబ్బరికాయలు కొట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మరియమాత భక్తులమైన మనం మహోత్సవాలను సందర్శించినపుడు హృదయ పరివర్తన పొంది తిరిగి



సమిష్టి దివ్యపూజాబలి వేదిక వద్దకు బిషప్‌లను ఊరేగింపుగా తీసుకొస్తూ..

వెళ్లాలని విజయవాడ కతోలిక పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న గుణదల మాత 101 ముగింపు మహోత్సవాలకు మంగళవారం ముఖ్యఅతిథిగా తెలగతోటి జోసఫ్ రాజారావు హాజరయ్యారు. భక్తులను ఉద్దేశించి ఆయన సందేశం ఇస్తూ.. మరియతల్లి పరమ పవిత్రురాలని దేవునికి జన్మనిచ్చి సంపూర్ణ అనుగ్రహాలు పొందారని తెలిపారు. గుణదల కొండపై కొలువై ఉన్న లూర్ధుమాత ఆశీస్సులు, దీవెనలు భక్తులకు మెండుగా లభిస్తున్నాయని, అందుకే ఆమెకు భక్తులు నీరాజనాలు పలుకుతున్నారని చెప్పారు. ప్రతి కతోలిక కుటుంబం ఆలోచనలు పవిత్రంగా ఉండాలన్నారు. శిలువ అంటే దేవుని శక్తి అని.. శిలువ పుణ్యమార్గం వైపు భక్తులను నడిపిస్తుందని తెలిపారు. ఫ్రాన్సు దేశంలోని లూర్ధునగర్‌లో బెర్నదత్ అనే బాలికకు లూర్ధుమాత 18 సార్లు దర్శనమిచ్చిందని చెప్పారు. కతోలిక భక్తులమైన మనకు యేసు ప్రభువు మార్గం కావాలన్నారు. 2025 సంవత్సరాన్ని జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని గుర్తుచేశారు. గుణదల పుణ్యక్షేత్రం దగ్గర్లో నూతనంగా నిర్మిస్తున్న శతాబ్ది లూర్ధుమాత దేవాలయం త్వరగా పూర్తికావాలని దేవుని ప్రార్థిద్దామని చెప్పారు. పరిశుద్ధ పోప్ జాన్ పాల్-2 ఫిబ్రవరి 11న 33 సంవత్సరాల క్రితం విశ్వవ్యాప్త వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని ఆదిరించాలని చెప్పిన విషయాన్ని ఎవరూ మరువరాదన్నారు. అనంతరం బిషప్ గ్రాసి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అలంకరించిన పూజా పీఠంపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గుంటూరు కతోలిక పీఠం బిషప్ చిన్నాబత్తుల భాగ్యయ్య, ఇటాలియన్ విశ్రాంత బిషప్ సీజర్ బొనవెంచర్, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ మేశపాం గాబ్రియేలు, తోట సునీల్ రాజు, తెలగతోటి పాలు, డయాసిస్ గురువులు ముగింపు మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం బిషప్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్‌లు కతోలిక భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. ఫాదర్ బి.జాన్‌పీటర్ రచించిన దివ్యపూజాబలి పుస్తకాన్ని పీఠాధిపతులు ఆవిష్కరించారు. మధిర బెర్నాడ్ ఆధ్వర్యంలో విజయవాడ మేత్రాసన గాయక బృందం ఆలపించిన గీతాలు పీఠాధిపతుల ప్రశంసలు అందుకున్నాయి. సత్యోపదేశ పరీక్షల్లో గెలుపొందిన వారికి పీఠాధిపతులు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోటసునీల్ రాజు, ఫాదర్ తెలగతోటి పాలు(జర్మనీ), పల్లె జోజిబాబు, పసల తోమస్, ఆస్ట్రేలియా దేశపు కతోలిక భక్తులు, డయాసిస్ గురువులు, కన్యస్త్రీలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెల్లటూరు విచారణ బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. దర్శి డాన్‌బోస్కో ఆధ్వర్యంలో ప్రదర్శించిన నిరీక్షణ యాత్రికుల సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. రేగుంట మేరీ ఫ్రాన్సిస్ నాట్యమండలి వారు ప్రదర్శించిన లాజరు-ధనవంతుడు నాటకం, కొండపావులూరు జె.ఎం.జె నాట్యమండలి ప్రదర్శించిన నిడువని ప్రేమ నాటకం ఆసాంతం భక్తులను కట్టిపడేసింది.



ప్రత్యేక ఆకర్షణగా విదేశీయులు



భక్తులను ఉద్దేశించి సందేశం ఇస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



మదినిండా భక్తితో..



పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న విశ్వక్సేన్

జిల్లాలో విశ్వక్సేన్ సందడి
సుబ్బారాయుడిని దర్శించిన సినీహీరో

మోపిదేవితి/అవనిగడ్డ/పెడన, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రముఖ సినీ హీరో విశ్వక్సేన్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు స్వాగతం పలుకగా, నాగపుట్ట వద్ద పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. మోపిదేవి విచ్చేసిన విశ్వక్సేన్‌కు ఎంపీ బాలశౌరి తనయుడు అనుదీప్, కూటమి నేతలు మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావులు స్వాగతం పలికారు.

- అవనిగడ్డలో సినీహీరో విశ్వక్సేన్ సందడి చేశారు. 'లైలా' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం అవనిగడ్డ విచ్చేసిన ఆయన స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. అక్కడి నుంచి తిరిగి వెళుతూ చల్లపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్పెషల్ బాదంపాలు రుచిచూశారు.
- నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై యాజమాన్యంతో హీరో విశ్వక్సేన్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీ వల్లభనేని బాలసౌరి తనయుడు అనుదీప్, జనసేన నేత బండి రామకృష్ణ తనయుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం వీరమ్మ



ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొలిచే భక్తుల కొంగుబంగారమైన వీరమ్మ కోరిన కోర్కెలు తీర్చే తల్లిఅంటూ ఆలయ ప్రదక్షిణలు చేస్తు చిన్నపెద్ద తేడాలేకుండా భక్తులు తిరునాళ్లలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. తిరునాళ్లలో నాల్గవరోజు మంగళవారం భక్తులు అమ్మవారికి మొక్కుతీర్చుకున్నారు. గొర్రెపొటేళ్ల ప్రభబండ్లు, చీర సారె కావిడలతో డప్పువాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణలు చేశారు. బుధవారం పౌర్ణమి పుర స్కరించుకుని అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అంచనా.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుల బెయిల్ నేటికి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో జైల్లో ఉన్న నిందితుల బెయిల్ పిటిషన్ విచారణను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం 88 మందిని పోలీసులు నిందితులుగా గుర్తించారు. వారిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇన్‌టర్మ్ ఆర్డర్ ఇచ్చింది. ఈ ఉత్తర్వుల గడువు ముడుగుస్తుండటంతో నిందితులు ఎస్సీ, ఎస్టీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం వాదనలు జరిగాయి. రెండు వర్గాల న్యాయవాదుల వాదనలను విన్న తర్వాత న్యాయాధికారి హిమబిందు విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

నూరుశాతం పన్ను వసూళ్లు లక్ష్యం

» రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు



మున్సిపల్ కమిషనర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు

ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీల్లో నూరుశాతం పన్నుల వసూళ్లు కావాలని రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ అప్పిలేట్ అధికారి నాగనరసింహారావు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో మచిలీపట్నం, గుడివాడ, పెడన, తాడిగడప, ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయాల పరిధిలో ఆస్తి పన్ను, కుళాయి, వ్యాపార, ఇతర పన్నుల వసూళ్లపై కమిషనర్లు, సెక్షన్ హెడ్స్‌తో స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు మున్సిపాలిటీల్లో వివిధ కారణాల వల్ల పన్నుల వసూళ్లు తక్కువగా ఉందని, మార్చి చివరికి నూరుశాతం వసూళ్లపై దృష్టిసారించాలన్నది లక్ష్యమన్నారు. డివిజన్ పరిధిలో అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించి సమీక్షిస్తున్నామన్నారు. కార్యకలాపాలన్నీ ఈ ఆఫీస్ ద్వారా చేయడంవల్ల పారదర్శకంగా ఉంటుందన్నారు. ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి, కౌన్సిల్ తీర్మానాలు అమలు తదితర అంశాలను సమీక్ష చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 28 మున్సిపాలిటీల్లో సమీక్ష నిర్వహించామన్నారు. పన్నులు కొన్ని మున్సిపాలిటీల్లో షాప్, వ్యాపార, ఇతర లైసెన్సులు రివైజ్ చేయవలసి ఉందన్నారు. మచిలీపట్నం పురపాలక సంఘం కమిషనర్ బాపిరాజు, గుడివాడ కమిషనర్ శ్రీనివాసరావు, తాడిగడప కమిషనర్ భవానిప్రసాద్, ఉయ్యూరు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, పెడన కమిషనర్ రాజగోపాల్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

అమరావతికి హడ్కో రుణం
రూ.11 వేల కోట్లు మంజూరు

» ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల అప్పు
» త్వరలో కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు



విజయవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్(జేజీఎం) ఎస్ఎం శ్రీనివాస్, జేజీఎం(ప్రాజెక్ట్) కె.విజయకుమార్ మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబును కలిసి రుణ మంజూరు పత్రాలను అందించారు. రుణపత్రాలను స్వీకరించినప్పటి నుంచి నాలుగు నెలల్లో లోన్ అగ్రిమెంట్ వ్యవహారాలను పూర్తి చేసుకోవాలని హడ్కో ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐఏఎస్, ఏపీఎన్‌జీవో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు, జడ్జీల క్వార్టర్లు, గవర్నమెంట్ టైప్-1, 2 భవనాలు, ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులు, హ్యాపీ నెస్ట్, సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాల పునర్నిర్మాణాలు, ఎల్‌పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, ట్రంక్ ఇన్‌ఫ్రా పనులు, అమరావతి వరద నియంత్రణ పనులు తదితర అనేక ముఖ్యమైన పనులకు టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీ సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.31 వేల కోట్ల రుణాన్ని పొందేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైంది. ఆ పత్రాలు కూడా సీఆర్‌డీఏకు అందాయి. ఇదే సందర్భంలో హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రయత్నాలు చేపట్టారు. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ కూడా రుణం ఇవ్వటానికి మౌఖికంగా అంగీకరించాయి.

108 ఉద్యోగి ఆత్మహత్యాయత్నం!

» పై అధికారులు వేధిస్తున్నారని మనస్తాపంతో మాత్రలు మింగిన వైనం
» చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం



చికిత్స పొందుతున్న దాసి బసవరాజు

చల్లపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమంది ప్రాణాలు కాపాడేందుకు కృషిచేసిన చల్లపల్లి 108 ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) దాసి బసవరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చేయని తప్పునకు విధుల నుంచి నిలుపుదల చేయటంతోపాటు నోటీసులు ఇచ్చి లొకేషన్ మార్చుతామంటూ ఉన్నతాధికారులు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ మేనేజర్ హరీష్‌రెడ్డిలు ఒత్తిడికి గురిచేస్తున్నారని సోమవారం అర్ధరాత్రి ఆటోనగర్‌లో సెల్ఫీ వీడియో తీసి అనంతరం మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సెల్ఫీ వీడియో ద్వారా విషయం తెలుసుకున్న బంధుమిత్రులు బసవరాజును చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ప్రాణాపాయం తప్పగా అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది.

వివరాల్లోకి వెళితే.. ఫేక్ కేసు చేశారంటూ బసవరాజును గతనెల 27న, ఘంటసాల అంబులెన్స్ ఈఎంటీ నడకుదురు సుమంత్‌కుమార్, పైలట్ కొమ్మకూరు సంకిరణ్‌లను 26న ఉన్నతాధికారులు విధుల నుంచి నిలుపుదల చేశారు. మిత్రుని ఇంట శుభకార్యానికి హాజరయ్యేందుకు బసవరాజు 25న బైక్‌పై రామరాజుపాలెం బయలుదేరాడు. మార్గమధ్యలో అంబులెన్స్‌లో వచ్చిన ఘంటసాల ఈఎంటీ, పైలట్‌లతో కలిసి ముగ్గురూ ఫంక్షన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ముగ్గురినీ విధులనుంచి నిలుపుదల చేశారు. విధుల్లో ఉండి అనుమతిలేకుండా ఫంక్షన్‌కు వెళ్లటం మొదటి తప్పుగా భావించి మన్నించాల్సిందిగా ఘంటసాల ఈఎంటీ, పైలట్‌లు లెటరురాశారు. సెలవులో ఉన్న తనపై చర్యలు తీసుకోవటంపై బసవరాజు అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈనెల 7న ఎల్ 2 నోటీసులు ఇచ్చి లొకేషన్ మారుస్తామని, సెలవులో ఉన్న తనను వేరేచోటకు మార్చుతామని చెప్పటంతో బసవరాజు ఆవేదనకు గురయ్యాడు. మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కొక్కెర వ్యాధితో 11 వేల కోళ్లు మృతి!

గంపలగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనుముల్లంక గ్రామంలో అత్తునూరు పద్మారెడ్డికి చెందిన కోళ్ల ఫాంలో సుమారు 11వేల కోళ్లు కొక్కెర వ్యాధితో మృతి చెందినట్టు పశు వైద్యాధికారి అభిలాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూ కారణం కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సరహద్దులైన నెమలి, పెనుగొలను, గోసవీడు చెక్ పోస్టుల వద్ద కోళ్ల రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొంతకాలం కోడిమాంసం తినకుండా ఉంటే మంచిదన్నారు. కోళ్ల ఏకారణంతో చనిపోయింది తేలాల్సి ఉందన్నారు.

ఏపీలో 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు

» ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం



వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు ఉన్నాయని, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్) వెల్లడించారు. పార్లమెంటులో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు మంగళవారం మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వివరాలు వెల్లడిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 18, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6, కృష్ణాజిల్లాలో 14, ఎన్టీఆర్ జిల్లాలో 11 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల ఇంటి వద్దనే మెరుగైన సేవలు అందించేందుకు 1962 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ పథకం ద్వారా 66,54,662 మంది రైతులు సేవలు అందుకున్నారని తెలిపారు. మొబైల్ యూనిట్లను 100 శాతం కేంద్రమే భరిస్తుందన్నారు. నిర్వహణ ఖర్చులను మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయన్నారు. కాగా దేశవ్యాప్తంగా ఈ పథకం కింద ఇప్పటి వరకు 997.59 కోట్లు విడుదల చేశామని, మొబైల్ యూనిట్లు మారుమూల ప్రాంతాల్లో, దూర ప్రాంతాలలో రైతుల వద్ద ఉన్న పశువులకు అత్యవసర వెటర్నరీ సేవలు అందించేందుకు సహాయపడుతున్నాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన దేశవ్యాప్తంగా పశువుల ఆరోగ్య సంరక్షణ, తదితర అంశాలను వెల్లడిస్తూ ఏపీలో 16,08,868 మంది రైతులు లబ్ది పొందారని పేర్కొన్నారు.

విజయవాడ డివిజన్ పరిధిలో
నేటి నుంచి పలు పాసింజర్ రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కృష్ణా కెనాల్-గూడూరు మధ్య 3వ ట్రాక్ పనుల సందర్భంగా తెనాలి యార్డును ఆధునీకరిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త ప్లాట్ ఫారం, కొత్త అప్రాన్ నిర్మాణాలు చేస్తున్నందున పలు పాసింజర్ రైళ్లను ఈనెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేశారు. 67221 విజయవాడ - తెనాలి రైలును, 67231, 67332 తెనాలి - రేపల్లె రైళ్లను ఈనెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేశారు. 67224 రేపల్లె - తెనాలి రైలును 60 నిమిషాల మేరకు రీషెడ్యూల్ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

మాన్యువల్ ఇంటి పన్ను రసీదులపై విచారణకు ఆదేశం

ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగరపంచాయతీలో ఇంటిపన్ను రసీదులు ఆన్‌లైన్ కాకుండా మాన్యువల్‌గా ఇవ్వడంపై విచారణ చేయవలసిందిగా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కె.కన్నబాబు ఆశాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. నగరపంచాయతీ పరిధిలో భవనాలకు ఇంటిపన్నుకు సంబంధించి మాన్యువల్‌గా రసీదులు ఇచ్చి వసూలు చేసిన పన్నుల డబ్బు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌రఘు బాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు నగరపంచాయతీ నిధులకు జమ చేయడంలేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిరువురిపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ముఖ్య కార్యదర్శి కన్నబాబుకు జనవరి 17న కలసి ఫిర్యాదు చేయగా ఆమేర విచారణకు ఆదేశించినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ మంగళవారం తెలిపారు.

రూ.20 కోట్ల పంచాయతీ స్థలం కబ్జా

●లే అవుట్‌లో కామన్ స్థలం 2,226 గజాలు రిజిస్ట్రేషన్ ● అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం, అంబాపురం పంచాయతీలోగల ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఉద్యోగుల సహకార బిల్డింగ్ సొసైటీ కాలనీలో రూ.20 కోట్ల విలు వైన పంచాయతీ స్థలం కబ్జాకు గురైందని అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో వివరాలు తెలిపారు. లే అవుట్‌లో కామన్ స్థలంగా వదిలిన 2,226 గజాల పంచాయతీ స్థలాన్ని రిటైర్డ్ అధికారి పి.జక రయ్య రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారని, గ్రామ సర్పంచ్‌గా అదేమని ప్రశ్నించిన తనపై జకరయ్య ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని తెలిపారు. రిటైర్డ్ అధికారికి మద్దతుగా నగరానికి చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారి తనను బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి అది పంచా యతీకి సంబంధించిన స్థలమని చెప్పారు. నాలుగు దశాబ్దాల కిందట ఎఫ్‌సీఐ ఉద్యోగులు అంబాపురం పంచాయతీ పరిధిలో స్థలం కొనుగోలు చేసుకుని లే అవుట్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఉడా నిబంధనల ప్రకారం సుమారు 5వేల గజాలను



వివరాలు తెలియజేస్తున్న గ్రామ సర్పంచ్ సీతయ్య

సామాజిక అవసరాల కోసం అంబాపురం పంచాయతీకి అప్పగించారని తెలిపారు. ఆ స్థలంలోని కొంత భాగంలో పార్కు ఏర్పాటు చేశారని, మరికొంత స్థలాన్ని గతంలో కొందరు కబ్జా చేయగా, హైకోర్టు ఆదేశాల మేరకు వారంతా ఖాళీ చేశారని వివరించారు. ఇప్పుడు మళ్లీ పుల్లా జకరయ్య కొంత మంది పలుకుబడి ఉన్న నేతలతో కలిసి కబ్జాకు పాల్పడ్డారని చెప్పారు. ఈ కాలనీలో తాగునీటి వసతి లేదని, వాటర్ ట్యాంక్ నిర్మించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా పంచాయతీకి చెందిన 2,226 గజాల్లో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మించాలని ఇటీవల పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిందని చెప్పారు. అనూహ్యంగా ఈ స్థలం తనదని రిటైర్డ్ అధికారి పి. జకరయ్య ఫెన్సింగ్ వేయడం బాధాకరమన్నారు. స్థలం ఆయనది కాదని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా తమ వద్ద ఉన్నాయని, పంచాయతీ స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో కబ్జా కానీయమని స్పష్టం చేశారు. ఆ స్థలంలో గతంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు సైతం రద్దు చేయాలని సబ్ కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నాయని, సంబంధిత ఆదేశిత పత్రాలను ఈ సందర్భంగా చూపారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్ఎస్ నాయక్, కమిటీ నాయకులు వసంత్, చల్లగాని సునీల్, భాస్కరరావు, మోహన్ రావు, తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిని రక్షించాలన్నారు. గ్రామస్తులకు మద్దతుగా టీడీపీ కృష్ణాజిల్లా నాయకులు గుజ్జరపల్లి బాబూరావు, జి.నరసయ్య, కోనేరు సందీప్, తదితరులు మాట్లాడిన వారిలో ఉన్నారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి నగర పోలీస్ కమిషనర్‌కు, విజయవాడ రూరల్ మండలం తహసీల్దార్‌కు గ్రామ పంచాయతీ స్థలాన్ని కబ్జా కాకుండా రక్షించాలని వినతి పత్రాలు అందజేశారు.



వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం

ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిపించారు. వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య బలిహరణాదులు, హోమం, జగజ్యోతి, నీరాజనం నిర్వహించారు. సాయంత్రం జరిగిన స్వామివారి కల్యాణ ఉత్సవానికి భక్తులు తరలివచ్చి తిలకించారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం వెనుక భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులు నెక్కంటి కార్తికేయ చౌదరి, కొసరాజు దుష్యంత్ కుమార్ కుటుంబ సభ్యులు 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా అంకమ్మతల్లి గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బిళ్లనపల్లిలో అంకమ్మతల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు సాయివేణుశర్మ ఆధ్వర్యంలో మంగళవారం సుప్ర భాతసేవ అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ, ఆకుపూజ నిర్వహించారు. తదనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి మహిళలు వారపోసి హారతులతో స్వాగతం పలికి పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబూరావు, హేమంత్‌కుమార్, మోహన్‌కుమార్, తులసీరాంప్రసాద్, చలసాని మహేష్, వీరమాచనేని మహేష్, గుళ్లపల్లి సుమన్‌కుమార్, మూల్పూరి ఉమామహేశ్వరరావు, లింగం వీరభద్రరావు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోరంకి భవ్య రామాలయానికి రూ.6లక్షల విరాళాలు

పెనమలూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పోరంకి భవ్యరామాలయానికి మంగళవారం భక్తులు మరో ఆరులక్షల విరాళాలను అందించారు. సమృద్ధి రియల్ ఎస్టేట్ ఓనర్లు పొట్లూరి నాగ శ్రీనివాసరావు, పెంచలరెడ్డి రెండు లక్షలు, తోటకూర వీరయ్య చౌదరి భార్య సీతారావమ్మ జ్ఞాపకార్థం కుమారులు వెంకట సుబ్బారావు, హరకిషోర్‌బాబులు లక్ష, బొబ్బా గోపాల కృష్ణ లక్ష, తోటకూర కోటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య ప్రజారాజ్యం లక్ష, గుమ్మడిపల్లి గణేష్‌కుమార్, పద్మ దంపతులు లక్షను కోదండరామాలయ కమిటీ సభ్యులకు అందించారు.



కల్యాణం జరిపిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరీ దంపతులు

కన్నుల పండువగా లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవం

గన్నవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా మంగళవారం రాత్రి జరిగింది. ఉదయం జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు అఖండ దీపారాధనతో పూజలు ప్రారంభమయ్యాయి. . జాస్తి నాగేశ్వరరావు, అనంతలక్ష్మీ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టుకు మానుపూజ, గ్రామ పొంగళ్ళు సమర్పించారు. రాయనగర్ గీతా సమాజం ఆధ్వర్యంలో సౌందర్య లహరి పారాయణం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీస్వామి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఎంఈవో కె.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు ధరింపజేసి ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరీ దంపతులతో పాటు పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో అందరు సుఖసంతోషంగా ఉండాలన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



క్యూలైన్లకు టెంట్లు ఏర్పాటు

ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ల వద్ద ఆలయ కమిటీ టెం ట్లు వేసి క్యూలో వేచి ఉండే భక్తులకు నీడ ఏర్పాటు చేసింది. తిరునాళ్ల సందర్భంగా మొక్కుబడి తీర్చుకునేందుకు వేలాదిగా తరలివస్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో ఎండకు ఇబ్బంది పడు తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచు రించిన కథనానికి ఆలయ కమిటీ, పోలీసులు స్పందించారు. క్యూలైన్ల వద్ద, ఆలయం చుట్టూ నీడకు టెంట్లు వేయగా, రోడ్డు మధ్యలో వాహనాలు నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భక్తుల దాహార్తి తీర్చడం అభినందనీయం

భక్తులకు దాహం తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఎంకే ఇంగ్లీషు మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో చలివేంద్రాన్ని సీఐ రామారావు, ఎస్సై విశ్వనాథ్ మంగళవారం ప్రారంభించారు. స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబును అభినందించారు. ప్రిన్సిపాల్ మణికుట్టన్ నారాయణ్‌పాల్గొన్నారు.

బందోబస్తును పరిశీలించిన డీఎస్పీ

పోలీస్ బందోబస్తును గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గండదీపాల ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని, పటిష్టమైన బందోబస్తు వల్ల ఎటువంటి సంఘటనలు జరుగకుండా విజయవంతంగా ముగిసిందన్నారు. ఈనెల 18న జరిగే అమ్మవారి శిడిబండి ఉత్సవానికి అవసరమై ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీఐ రామారావు, కంకిపాడు సీఐ మురళీ కృష్ణ, ఎస్సై విశ్వనాథ్, రూరల్ ఎస్సై సురేశ్‌బాబుతో పరిసరాలు పరిశీలించారు.

జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల విజయభేరి

పెనమలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలయిన జేఈఈ-మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో విజయవాడ నారాయణ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సంస్థ డీజీఎం రవిశంకర్ తెలిపారు. తోరాటి భరద్వాజ్99.98, వడ్లమూడి లోకేష్99.97, ఎం. కృష్ణ హర్షిత్ 99.95, ఆంజనేయ రెడ్డి99.95, కూన లిఖిత శ్రీ99.94, తేజ యశ్వంత్ 99.94, శివసాయి దినేష్99.88, ఆశ్రిత సాయి లక్ష్మి 99.63, వీ. గీతిక 99.55, షణ్ముఖ శ్రీరాజ్ 99.30, దత్త సాయి 99.26, మనోజ్ఞ 99.22 పర్సెంటైల్స్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని రవిశంకర్ పేర్కొన్నారు. 99పర్సంటైల్‌కు పైగా 103 మంది, 98పర్సంటైల్ పైగా 184 మంది, 97 పర్సంటైల్ పైగా 260 మంది. 96 పర్సంటైల్ పైగా 320మంది, 95పర్సంటైల్ పైగా 430, 90 పర్సంటైల్ పైగా 715 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఆయన తెలిపారు. పటిష్టమైన బోధనా పద్ధతులు, మైక్రో షెడ్యూలింగ్, పరీక్ష విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాకుండా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తదితర అంశాలవల్లే ఇంతటి ఘన విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. విజేతలను డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే కఠిన చర్యలు

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అనధికారికంగా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఖ ఈఈ పి.హరిబాబు హెచ్చరించారు. మంగళవారం ఎనికేపాడు సెక్షన్‌లో ఈఈ, డిప్యూటీ ఈఈలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 36 బృందాలు నిర్వహించిన తనిఖీల్లో 108 గృహ వినియోగం, 7 వాణిజ్య వినియోగంలో అదనపులోడు వినియోగిస్తున్నాట్లు గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి, జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ పి.విజయ కుమారి, డిప్యూటీ ఈఈ ఇ.రామమూర్తి, బి.నవీన్, ఎం.శివ కుమార్, ఎనికేపాడు ఏఈ పరమేశ్వరరావు, గుణదల డివిజన్ ఏఈ, ఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కంకిపాడు: కంకిపాడుకు చెందిన పిల్లా రాధాకృష్ణ(59) సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో విచారించినా సమాచారం లేదు. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో కోలవెన్ను డొంక రోడ్డులో శవమై పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు విచారిస్తున్నట్లు ఎస్సై సందీప్ చెప్పారు.

డీఎం వైఖరిపై ఎన్ఎంయూఏ నిరసన

ఉయ్యూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చార్ట్ కౌన్సిలింగ్‌లో డిపో మేనేజర్ మొండి వైఖరికి నిరసనగా ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో పీటీడీ(ఆర్టీసీ) కార్మికులు, ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. డిపో గేటు ఎదుట మంగళవారం కొద్దిసేపు నిరసన తెలిపిన సభ్యులు మాట్లా డుతూ కేంద్ర కార్యాలయం సర్క్యులర్ గైడ్‌లెన్స్ ప్రకారం చార్ట్ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా నిబంధనలు ఉల్లంఘిసు న్నారని ఆరోపించారు. బిట్స్‌లో లోపాలు సరిచేయమని ఎన్ఎంయూ కోరినప్పుడు అంగీకరించిన డిపో మేనేజర్ ఇతర అసోసియేషన్లు, యూనియన్లకు మేలు చేస్తూ ఏకపక్షంగా చార్ట్ కౌన్సిలింగ్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా 8రోజులుగా ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామని డిపో ఎన్ఎంయూఏ సభ్యులు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

గన్నవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94940-05725 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆలపాటి రాజా గెలుపే లక్ష్యం

ఎన్ఎస్పీఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎన్ఎస్పీఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. రంగన్నగూడెంలో ఎంపీపీ స్కూల్‌లోని ఓటర్లకు, గ్రామంలోని పట్టభద్రులను మంగళవారం కలిసి కరపత్రాలను పంపిణీ చేసి ఓటు అభ్యర్థించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, పాలసొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, నత్తా అబ్రహం, కనకవల్లి శేషగిరిరావు, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: ఆలపాటిని గెలిపించుకోవాలని రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ పెనమలూరు కార్యాలయంలో మాట్లాడుతూ రాజా విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. జువ్వాడ రాంబాబు, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటరు కుర్రా నరేంద్ర,పాల్గొన్నారు.



ఆలపాటికి మద్దతుగా ప్రచారం

గన్నవరం: ముస్తాబాదలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ళ సూర్యనారాయణ ప్రసాద్, మేడేపల్లి రమాదేవి, తంగిరాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి న్యూ టయోటా క్యామ్రి

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆటో మొబైల్ దిగ్గజం టయోటా కంపెనీ సెడాన్ క్యామ్రిను కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవి కుమార్ సిన్హా, లక్ష్మీ టయోటా సీఈవో రామకృష్ణ ఎనికేపాడులోని లక్ష్మీ టయోటా షోరూమ్‌లో మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ టయోటా సేల్స్ జనరల్ మేనేజర్ రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ టయోటా నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త క్యామ్రి కారులో 2.5 లీటర్ హైబ్రిడ్ పెట్రోల్ ఇంజిన్‌తో 230 హార్స్ పవర్, 25.49 కె.ఎం.పి.ఎల్ మైలేజ్ ఇస్తుందన్నారు. అద్భుతమైన ఎక్స్‌టీరియల్‌తోపాటు అధునాతన మైన టెక్నాలజీ, విశాలవంతమైన ఇంటీరియర్స్, 9ఎయిర్ బాగ్స్, టయోటా సేఫ్టీ సెన్స్ వంటి భద్రతా ప్రమాణాలున్నా యనారు. క్యామ్రి బుకింగ్స్ ప్రారంభమయ్యాయని, వివరాలకు షోరూంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ టయోటా సర్వీస్ జనరల్ మేనేజర్ పవన్, ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



క్యామ్రిని విడుదల చేస్తున్న కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవి కుమార్ సిన్హా, లక్ష్మీ టయోటా సీఈవో రామకృష్ణ, తదితరులు

కోకో 'పీట్' ఐడియా సూపర్ హిట్

సమస్య నుంచే సంపద సృష్టి

● పారేసిన కొబ్బరి బొండాల నుంచి కోకో పీట్, కోకో పీచు ● నగర ప్రజలకు మేలు, కార్పొరేషన్‌కు ఆదాయం

కొబ్బరి చెట్టు ఉపయోగాలు అనేకం. వాటి ఆకుల నుంచి వేర్ల వరకు మానవ జీవితానికి ఏదో ఒక మేలు చేస్తూనే ఉంటాయి. కొబ్బరి, కొబ్బరి నీళ్లు, కొబ్బరి నూనె వంటివి మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయి. దేవుడు ముందు కొట్టే కొబ్బరి కాయలు, మనం తాగి వదిలేసిన కొబ్బరి బొండాల వ్యర్థాలు కూడా మానవాళికి ఉపయోగపడవచ్చని సరికొత్త అర్థాలను చెబుతున్నాయి. 'ట్రీ ఆఫ్ లైఫ్' అని గొప్పగా పిలుచుకునే కొబ్బరిచెట్టు వ్యర్థాల నుంచి కోకో పిట్, కోకో పీచు వంటివి కార్పొరేషన్ తయారు చేయిస్తూ లాభాలను పొందుతోంది.

- ఆంధ్రజ్యోతి, అజిత్‌సింగ్‌నగర్



కోకో పీట్ తయారీ యంత్రం

గతంలో తాగిపారేసిన కొబ్బరి బొండాలు నగరంలో ఓ పెద్ద సమస్యగా ఉండేవి. ఏ మూలచూసిన కుప్పలు తెప్పలుగా పడి పారిశుధ్య కార్మికులకు ఎంతో తలనొప్పిగా మారేవి. దీనికి తోడు బొండాల వ్యాపారులు వీటిని బుడమేరు, ఏలూరు, బందరు కాలువల్లో పడవేసే వారు. దీంతో ఆయా ప్రాంతాలు దోమల ఆవాసాలకు కేంద్ర బిందువులుగా మారి వాటివ్యాప్తికి ప్రధాన కారణమౌతున్నాయి. కాలువలు ఎండిపోయిన సమయంలో దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగులో కలిసిపోవటంతో కాలువలు క్రమంగా పూడుకుపోయే పరిస్థితి ఏర్పడింది. మురుగు సమస్య అధికంగా ఉండేది. ప్రస్తుతం నగరపాలక సంస్థ వేసిన నూతన ఐడియాతో ఒకపక్క సమస్యకు పరిష్కారం దొరకడమే కాక సమస్య నుంచి సంపద సృష్టిస్తున్నారు.







కొబ్బరి వ్యర్థాల నిర్వహణ కేంద్రం

కోకో పీట్, కోకో పీచు ప్రాసెసింగ్ ఇలా..

గతంలో వ్యర్థాలుగా రోడ్ల పక్క, కాలువల్లో, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో పడి ఉండే ఈ బొండాల నుంచి నేడు కోకో పిట్, కోకో పీచు తయారీ చేస్తూ వీఎంసీ లాభాలను గడించడమే కాక చేతివృత్తిదారులకు ఉపాధిని కల్పిస్తోంది. ముందుగా కొబ్బరి బొండాలను సేకరించి అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌కు తరలిస్తారు. అక్కడ యంత్రాల ద్వారా కొబ్బరి బొండాల పీచును వేరు చేస్తారు. పీచు తీయగా మిగిలిన బొండాలను పొడి చేసి వచ్చిన పీట్‌ను వీఎంసీ పరిధిలోని పార్కులకు తరలించి మొక్కలకు ఎరువుగాను, వేర్ల పెరుగుదలకు పయోగపడేలా వినియోగిస్తున్నారు.

కిలో పీచు రూ.5

యూనిట్‌లో తీసిన కిలో పీచును రూ.5కు అధికారులు అమ్ముతున్నారు. ఆటోలు, ఇతర వాహనాల సీట్లకు, పరుపులు, సోఫాలు తదితర చేతి వృత్తిదారులు పీచును కొనుగోలు చేస్తున్నారు. ఈ పీచు కావాలనుకునే వారు సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో చలానా కట్టి కొబ్బరి పీచు కొనుగోలు చేయవచ్చు.



కొబ్బరి వ్యర్థాల గుట్ట



రక్తదానం చేస్తున్న ఉద్యోగులను పరామర్శిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ డ్రైవర్లు అభినందనీయులు

● రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ

బస్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలోని డ్రైవర్లు నిత్యం ఏకాగ్రతతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతుండటం అభినందనీయమని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా మంగళవా రం పీఎన్‌బీఎస్ డిస్పెన్సరీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రా రంభించారు. విజయవాడ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఈనెల 15తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు రక్తదానం చేసిన డ్రైవర్లు, ఉద్యోగుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. రక్తదానం ప్రాణం ఇవ్వటంతో సమానమని చెబుతూ మ రొకరి ప్రాణాలకు ఉపయోగపడే రక్తాన్ని ఇస్తున్నందుకు వారిని అభినందించారు. 83మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని కొనియాడారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీవీ రవివర్మ ఆపరేషన్స్ డైరెక్టర్ ఏ అప్పలరాజు, ఇంజనీరింగ్ డైరెక్టర్ పీ చెంగల్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.వై.దానం, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు స్వర్ణకుమారి, అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఎనికేపాడులో భూ వివాదం!

● వేధిస్తున్నారంటూ కలెక్టర్, సీపీకి బాధితుడి ఫిర్యాదులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎనికేపాడులో రూ.3కోట్ల విలువైన 11 సెంట్ల భూ వివాదంలో పోలీసులు తమపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారంటూ ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు అందింది. కోర్టులో కేసు నడుస్తున్నా ఒక పోలీసు అధికారి పటమట పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి ఇబ్బంది పెడుతున్నాడంటూ బాధితుడు కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో వెలగపూడి నాగార్జున తనకు వారసత్వంగా సంక్రమించిన 580 చదరపు గజాల స్థలాన్ని ఓ ప్రైవేటు ఫైనాన్షియర్ తమ తల్లిదండ్రులైన వెలగపూడి సాయి వెంకట సుబ్బారావు, పుష్పవతి నుంచి బలవంతంగా సేల్‌డీడ్ చేయించుకోవటమే కాక తమ స్వాధీనంలోని స్థలాన్ని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేశాడని ఆరోపించాడు. పటమట పోలీసులను ఆశ్రయించగా ఒక పోలీసు అధికారి ఒత్తిడితో తమ ఫిర్యాదును కాకుండా సేల్‌డీడ్ రాయించుకున్న ప్రైవేట్ ఫైనాన్షియర్ ఫిర్యాదును స్వీకరించి ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశాడు. ఈ వివాదం కోర్టు విచారణలో ఉండగా పోలీసులు తమను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో వాపోయాడు

ఘనంగా 'విజయ' వజ్రోత్సవం

పాలఫ్యాక్టరీలో కృష్ణా మిల్క్ యూనియన్ వేడుకలు



పాలకవర్గ సభ్యులతో కలసి కేక్ కట్ చేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పాలు, పాల పదార్థాలు విక్రయిస్తూ విజయ పథంలో దూసుకుపోతున్న విజయ డెయిరీ (కృష్ణా మిల్క్ యూనియన్) 60 ఏళ్ల వజ్రోత్సవాలు మంగళవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో వైభవంగా జరిగాయి. తొలుత యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు డైరెక్టర్లతో కలిసి ఫ్యాక్టరీలో ఉన్న కాకాని వెంకటరత్నం, వర్గీస్ కురియన్, నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 60 కేజీల కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ 60 ఏళ్లుగా పాడి రైతులకు భరోసా ఇచ్చేలా ఒక నమ్మకంతో కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధి చెందిందన్నారు. 650 లీటర్ల పాలసేకరణతో మొదలై, నేడు రోజుకి 3లక్షల లీటర్ల పాలసేకరణ జరుగుతుందని, లీటర్‌కు 50 పైసలు నుంచి ప్రస్తుతం లీటర్‌కు రూ.90కు పైగా చెల్లిస్తున్నామన్నారు. రూ.200 కోట్ల మిగులు నిధులతో దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తూ ఒక చరిత్ర కృష్ణా మిల్క్ యూనియన్(విజయా డెయిరీ) సృష్టించిందన్నారు. యూనియన్ ఎదుగుదలలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి చిల్లింగ్ సెంటర్‌ను 1965 ఫిబ్రవరి 11న పామర్రులో ప్రారంభించగా నాటి నుంచి నేటి వరకు దినదినాభివృద్ధి చెందుతూ పాడి రైతులకు, వినియోగదారులకు అండగా నిలుస్తోందన్నారు. సురక్షితమైన పాలను అందించడంలో ప్రమాణాలను పాటిస్తూ 3 సార్లు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్ దక్కించుకుందన్నారు. ఎండి. కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు ఉయ్యూరు అంజిరెడ్డి, దాసరి వెంకటబాలవర్ధనరావు, వీటీకేవీ సుబ్బారావు, అర్జా వెంకట నగేష్, చలసాని చక్రపాణి, వేమూరి సాయి వెంకటరమణ, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, పాలడుగు వెంకటరామ వరప్రసాద్, నెలకుదిటి నాగేశ్వరరావు, నెక్కలపు వాణిశ్రీ, చెరుకూరి లవయ్య, శనగల వెంకటశివజ్యోతి, మద్దుకూరి వెంకటలక్ష్మి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన పలువురికి సత్కారం

యూనియన్ వజ్రోత్సవం సందర్భంగా 30 ఏళ్లకు పైగా పనిచేసి సేవలందించిన లెనిన్, వీ.వెంకట బాలాజీ, కె. వెంకటేశ్వరరావు, జీ.కొండలరావు, జీ.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కేవీ శేషగిరిరావు, పీ కొండలను చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు సత్కరించారు.

చెరువులో పడి రెండేళ్ల చిన్నారి మృతి

● బోళ్లపాడు గ్రామంలో విషాదం



మృతి చెందిన హేమశ్రీ

ఘంటసాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన ఘంటసాల మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బోళ్లపాడు గ్రామానికి చెందిన అంగడాల శివరామకృష్ణ కుమార్తె హేమశ్రీ (2) కనిపించకపోవటంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం చెరువులో తేలడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు హుటాహుటిన చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలించలేదు. చిన్నారి మృతి చెందినట్టు వైద్యులు తెలియజేయటంతో కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.

బర్డ్‌ఫ్లూ భయం

(5వ పేజీ తరువాయి)

చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచడంతోపాటు అనుమానిత చికెన్ షాపులలో తనిఖీలు కూడా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కోళ్ల ఫారాల వద్ద అధికసంఖ్యలో కోళ్లు చనిపోతుంటే అక్కడి నుంచి నమూనాలు సేకరించి ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా వైద్య, పశుసంవర్ధకశాఖతో పాటు ఇతర విభాగాల అధికారులను ఆదేశించారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిమాంసం, కోడిగుడ్లు తింటే మనుషులకు ఈ వైరస్ సోకే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు జిల్లాకు తరలించకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

2 నెలల కిందట మోపిదేవిలో చనిపోయిన కోళ్లు

రెండు నెలల కిందట మోపిదేవి మండలంలోని కప్తానుపాలెంలోని పౌల్ట్రీఫామ్‌ల్లో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. నాటు కోళ్లు కూడా చనిపోవటంతో వాటి శాంపిళ్లను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఆ తర్వాత వాటి వివరాలను బయటకు వెల్లడించలేదు. అప్పటి నుంచి జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫామ్‌లను పశుసంవర్ధకశాఖ అధికారులు తరచుగా పరిశీలిస్తూ బర్డ్‌ఫ్లూ సోకకుండా కోళ్లకు వాక్సినేషన్ వేయడం, పౌల్ట్రీఫామ్‌ల వద్ద తీసుకోవాల్సిన పారిశుధ్య చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అమ్మకాలు తగ్గినా.. ధర అక్కడే!

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోడిమాంసం అమ్మకాలు పడిపోతుండగా, కోడి ధర మాత్రం తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. ప్రస్తుతం కిలో కోడిమాంసం స్కిన్‌లెస్ రూ.240 ఉంది. కొద్దిరోజుల కిందటి వరకు ఇది రూ.200 ఉండేది. స్కిన్‌తో ఇప్పుడు రూ.230 పలుకుతోంది. కోడిమాంసం దుకాణాలకు వచ్చే కోళ్ల ధరలను పౌల్ట్రీలు క్రమంగా పెంచుతున్నాయి. పౌల్ట్రీల నుంచి కోడిమాంసం దుకాణాలకు వచ్చే కోడి కిలో రూ.100 ఉండేది. రెండు రోజుల నుంచి ఈ ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు కిలో కోడి ధర రూ.125 పలుకుతోంది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో రూ.25 ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు


జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా నిఘా ఉంచాం. కోడి మాంసం దుకాణాలను కూడా పరిశీలిస్తున్నాం ఇతర జిల్లాల నుంచి తక్కువ ధరకు కోళ్లను దిగుమతి చేసుకోకుండా చూస్తున్నాం. బర్డ్‌ఫ్లూ సోకకుండా పౌల్ట్రీ యజమానులు ఇప్పటికే కోళ్లకు వ్యాక్సినేషన్ చేయించారు. వలస పక్షులు కోళ్లఫామ్‌ల పక్కనే ఉన్న చెట్లపై వాలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం.

-ఎన్‌సీ హెచ్.నరసింహులు, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

14న 'పేట'కు భార్గవ్ భౌతికకాయం

నెట్టెం చొరవ, లోకేశ్ కృషితో ఐర్లాండ్ నుంచి ప్రత్యేక విమానంలో రాక





చిట్టూరి భార్గవ్, చెరుకూరు సురేష్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జనవరి 31న ఐర్లాండ్‌లోని కార్లో నగర సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో అసువులు బాసిన జగ్గయ్యపేటకు చెందిన చిట్టూరి భార్గవ్ భౌతికకాయం శుక్రవారం జగ్గయ్యపేటకు చేరుకోనుంది. తీవ్రమైన మంచు కురుస్తుండటంతో కార్లో సమీపంలో రాతో ప్రాంతంలో చెట్టును ఢీకొని బోల్తా కొట్టిన సంఘటనలో చిట్టూరి భార్గవ్‌తో పాటు గుంటూరుకు చెందిన చెరుకూరు సురేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిద్దరూ అక్కడ సౌత్ ఈస్ట్ టెక్నాలజికల్ వర్సిటీలో ఎంఎస్ చదువుకునేందుకు ఏడాదిన్నర క్రితం వెళ్లారు. చదువు పూర్తయి ఉద్యోగాన్వేషణలో ఉండగా ప్రమాదం జరగటంతో ఆ రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగాయి. చిట్టూరి భార్గవ్ తండ్రి సాయిబాబు గండ్రాయి గ్రామం కాగా, జగ్గయ్యపేటలో నివాసం ఉంటున్నాడు, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చొరవతో మంత్రి నారా లోకేశ్ ఐర్లాండ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి భౌతికకాయాలను త్వరగా పంపించాలని కోరారు. సీఎంవో నుంచి పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన 15 రోజులకు భౌతికకాయాలు స్వదేశానికి రానున్నాయి. బుధవారం ఐర్లాండ్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి గురువారం రాత్రికి హైదరాబాద్ లోనికు చేరుతాయని భార్గవ్ కుటుంబసభ్యులకు సమాచారం అందింది.

డాక్టర్ గురురాజు హోమియో కళాశాల

ప్రిన్సిపాల్ రమాదేవి సస్పెన్షన్

● పెన్షన్ ప్రక్రియలో లేటు చేయడమే కారణం

గుడివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ గురురాజు హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రమాదేవిని సస్పెండ్ చేస్తూ ఆయూష్ డిపార్టుమెంట్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఆయూష్ పరిధిలోని హోమియోపతి కళాశాలలో పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ విషయంలో కోర్టు తీర్పునిచ్చింది. పర్మినెంట్ ఉద్యోగులు 1987 నుంచి 1991 వరకు తాత్కాలికంగా విధులు నిర్వర్తించారు. పలువురు ఉద్యోగులు రిటైర్ అయి, రావలసిన బెనిఫిట్స్ తీసుకుని పెన్షన్ పొందుతున్నారు. కోర్టు నాలుగేళ్ల పనికాలాన్నీ పరిగణనలోకి తీసుకుని పెన్షన్, బెనిఫిట్స్‌ను చెల్లించాలని ఆదేశాలిస్తూ మూడు వారాల గడువునిచ్చింది. స్థానిక డా.గురురాజు హోమియోపతి కళాశాలలో విధులు నిర్వర్తించిన ఉద్యోగి ఒకరు 2007లో రిటైరయ్యారు. పెన్షన్, బెనిఫిట్స్ మొత్తం అంచనాలను ప్రిన్సిపాల్ డా.డి.రమాదేవి తయారు చేసి ఏజీ కార్యాలయానికి, ఆయూష్ విభాగానికి పంపారు. ప్రక్రియ పూర్తికి కోర్టు గడువుకన్నా అదనంగా మరోవారం ఎక్కువ సమయం తీసుకున్నారు. దీంతో న్యాయమూర్తి పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి, అదనపు సమయం తీసుకున్నందుకు ఆయూష్ కమిషనర్‌ను వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చారు. దీంతో ఆయూష్ కమిషనర్ డా.రమాదేవిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదన్నారు.

యంత్రాలతోనే ఇసుక తవ్వకాలు

● ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో అధికారుల వెల్లడి ● వద్దంటున్న మేస్త్రీలు



మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్, ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నూతన క్వారీల్లో పర్యావరణానికి ఆటంకం కలగకుండా చిన్న యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడతామని అధికారులు వెల్లడించారు. తోట్లవల్లూరు గ్రామ సచివాలయం-2 వద్ద మంగళవారం నార్తువల్లూరు రెవెన్యూ పరిధిలో 445 సర్వే నెంబరులో 25 హెక్టార్లలో నూతనంగా క్వారీ ఏర్పాటు చేసి 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు నిర్ణయించామని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణకు సదస్సు నిర్వహించారు. ఆర్డీవో హేలా షారోన్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తామని, ఇసుక తవ్వకాల వల్ల ఏమైనా పర్యావరణ ఇబ్బందులుంటే చెప్పాలని సూచించారు. ఎన్విరో ల్యాబ్స్ (విశాఖపట్నం) కన్సల్టెంట్ ఎంవీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ చిన్న జేసీబీలతో ఒక మీటరు లోతున ఇసుక తవ్వకాలు చేపడతారని, క్వారీలో 22 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రోడ్లపై దుమ్ము లేవకుండా వాటరింగ్ చేస్తారని, ఇసుక తవ్వకాలు చేసినవారు మొక్కలు నాటుతారన్నారు. అనంతరం జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు కొండారెడ్డి ప్రసంగించారు. సర్పంచ్ పెనుముత్స రాధిక, తూమాటి సుధాకర్, వల్లూరు కుమార్, మట్టా రాజేష్ మాట్లాడుతూ కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా ఇసుక తవ్వకాలు చేయాలని, యంత్రాలు పెడితే కార్మికులు నష్టపోతారన్నారు. ఇప్పటి వరకు జరిపిన ఇసుక తవ్వకాలతో గ్రామంలో దుమ్ము, దూళితో ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు, అలర్జీలకు, కంటి సమస్యలకు గురవుతున్నారని, ఈటిపై ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు.

ఇసుక క్వారీల్లో యంత్రాలు వద్దు

ఇసుక క్వారీల్లో యంత్రాలను ప్రవేశపెట్టవద్దని కోరుతూ మంగళవారం రొయ్యూరు ఇసుక ముఠా మేస్త్రీలు నిమ్మగడ్డ రాకేష్, లుక్కా దుర్గా నాగేశ్వరరావు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. రొయ్యూరులో 300 మంది ఇసుక కార్మికులు జీవనోపాధిని కాపాడాలని వారు కోరారు.

మరణించినా ముగ్గురికి ప్రాణదానం

● రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైన కోటేశ్వరరావు

● అవయవదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులు

● గ్రీన్‌చానల్ ద్వారా అవయవాలను తరలించిన కామినేని ఆసుపత్రి వైద్యులు

పెనమలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ మరో ముగ్గురికి ప్రాణం పోసి చిరంజీవి అయ్యాడు కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన బుద్దన కోటేశ్వరరావు. కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన బుద్దన కోటేశ్వరరావు (54) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం తాడిగడపలోని కామినేని ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ కోటేశ్వరరావు బ్రెయిన్ డెడ్‌కు గురవటంతో ఆసుపత్రి వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు కోటేశ్వరరావు అవయవ దానానికి అంగీకరించారు. నిబంధనల మేరకు కిడ్నీలు, లివర్‌ను సేకరించిన వైద్యులు గ్రీన్‌చానెల్ ద్వారా అవసరమైన చోట్లకు తరలించారు. కామినేని క్లస్టర్ హెడ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైద్యులు ఉయ్యూరు శ్రీధర్, రాంబాబు పాల్గొన్నారు.

మామిడి రైతులకు మంచి రోజులు!

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏపీఐఐసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఫ్లోర్ మిల్ యాజమాన్యం, ఏపీఐఐసీ మధ్య వివాదం

కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను అందుబాటులోకి తీసుకురావాలంటే.. ప్రధానంగా ప్రస్తుత నిర్వహణ సంస్థ ఏదైతే ఉందో దానిని సాగనంపే చర్యలను ఏపీఐఐసీ అధికారులు చేపడుతున్నారు. ఫ్లోర్ మిల్ యాజమాన్యం ఏపీఐఐసీ అధికారుల మీద ఒక సూట్ కూడా వేసింది. తాను గతంలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కొన్ని పనులు చేసి ఉన్నానని, వాటికి డబ్బులు చెల్లించాల్సిందిగా కోరినట్టు తెలుస్తోంది. ఏపీఐఐసీ అధికారులు మాత్రం ఈ పనుల గురించి తమకు ఎలాంటి సమాచారం లేదన్న వాదనలు వినిపిస్తున్నారు. నిర్వహణ చేసినందుకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. పనులకు సంబంధించి మాత్రం సమాచారం లేనందున చెల్లించటం కుదరదని చెబుతున్నారు. ఇక్కడే ఉభయుల నడుమ వివాదం తలెత్తింది. ఈ సమస్యను ఎట్టి పరిస్థితుల్లో మార్చి కల్లా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జెడ్ఎం సీతారాం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

మామిడి సీజన్‌కు అందుబాటులోకి..

మామిడి సీజన్‌కు నూరు శాతం మల్లవల్లి సీపీసీ యూనిట్ అందుబాటులోకి రానుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల మామిడి రైతాంగానికి కూడా సీపీసీ ఎంతగానో ఉపయోగపడుతుంది. నాణ్యమైన మామిడి పల్ప్ ఎగుమతులకు విదేశాలలో మంచి డిమాండ్ ఉంది. ధర కూడా బాగా పలుకుతుంది. కిందటి సారి కోర్ ప్రాసెసింగ్ సెంటర్ అందుబాటులోకి రాకపోవటం వల్ల మామిడి రైతులు నిరుత్సాహం చెందారు. సీపీసీలో అయితే చాలా తక్కువ ధరకు మ్యాంగో పల్ప్ తయారు చేయవచ్చన్న రైతులు పెట్టుకున్న ఆశలు వమ్ము అయ్యాయి. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



ప్యాకింగ్ యూనిట్

అసలు సీపీసీ ద్వారా ఏమేమి జరుగుతాయంటే..

కోర్ ప్రాసెసింగ్‌లో మెగా ఫుడ్‌పార్క్‌లోని ఆహార శుద్ధి పరిశ్రమలతో పాటుగా ఉద్యానపంటల రైతాంగానికి కూడా ఎంతగానో దోహద పడుతుంది. ఈ సీపీసీలో పల్పింగ్ లైన్ అనేది చాలా ప్రధానమైనది. గంటకు ఆరు టన్నుల టమాటా, 10 టన్నుల మామిడి, ఐదు టన్నుల బొప్పాయి, ఆరు టన్నుల జామకాయ, నాలుగు టన్నుల అరటి వంటి ఫ్రూట్ పల్ప్‌ను పల్పింగ్ లైన్ ద్వారా చేయవచ్చు. అలాగే ఫుల్లీ ఆటోమేటిక్ బ్రిక్ కార్టన్ ఫిల్లింగ్ అండ్ ప్యాకింగ్ లైన్ అనేది మరొకటి ఉంది. దీంట్లో 200 ఎంఎల్ జ్యూస్ ఉత్పత్తులను, కొబ్బరి నీటిని ప్యాకింగ్ చేస్తారు. ఈ సీపీసీలో 4000 మెట్రిక్ టన్నుల గోడౌన్ సదుపాయం కూడా ఉంది. ఇందులో అన్ని రకాల రా మెటీరియల్స్‌ను నిల్వ చేసుకోవచ్చు. మరో 3000 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజీ ఉంది. ఇందులో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పల్ప్ వంటివి నిల్వ చేయవచ్చు. ప్యాకింగ్ యూనిట్ కూడా ఉంది. ఈ యూనిట్‌లో 100 గ్రాముల నుంచి 2 కేజీల వరకు నిమిషానికి 50 - 70 ప్యాకెట్లను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 374 గృహ,వాణిజ్య వినియోగదారులు అవకతవకలకు పాల్పడగా రూ12.41 లక్ష జరిమానా విధించామని విజిలెన్స్ ఈఈ సిహెచ్ వాసు తెలిపారు. 364 సర్వీసులకు అదనపు లోడు కింద రూ.11.86 లక్షలు జరిమానాలు విధించామన్నారు. గుడివాడ డివిజన్ ఈఈ జి.బి.శ్రీనివాస్, గుడివాడ రూరల్ ఈఈ కిరణ్‌బాబు,కౌతవరం ఏఈ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

నేత్రపర్వంగా సత్యదేవుడి కల్యాణం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కన్నులపండుగగా నిర్వహిచారు. వందలాదిగా భక్తులు తరలివచ్చిస్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించి తరించారు. వేదపండితులు ప్రతి ఘట్టాన్ని ఆసాంతం వివరించారు. కె.రవికుమార్, సిహెచ్.వెంకటేష్, మురాల నరేష్, సనకా నాని తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

నందివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య రాకుండా శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులను ఆదేశించారు. కుదరవల్లి, లక్ష్మీనరసింహాపురం గ్రామాల మంచినీటి చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిల్టర్ బెడ్‌లను కూడా రిపేరు చేయించాలని అధికారులకు సూచించారు. సీసీ రోడ్లపై పనులు జరిగినదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, రామకృష్ణ, సింగవరపు బాబురావు, సువారి వెంకట రంగారావు, మనిముక్కు వేణు జాన్, మోజెష్, గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కళాకారుల సమాఖ్య సభ్యులు

ఘంటసాలకు కళాకారుల ఘననివాళి

గుడివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి ఘంటశాల వెంకటేశ్వరరావు గీతాలు అజరామరమని కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షులు బి.వి మోహనరెడ్డి, అధ్యక్షుడు విన్నకోట సత్యనారాయణ(బుజ్జి) అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో కోగంటి రాజబాపయ్యచౌక్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారుల సమాఖ్య కోశాధికారి ఆత్మకూరి సాంబశివరావు, ఉపాధ్యక్షులు లోయ రాధాకృష్ణ, బి.వి సత్యనారాయణ, పాత శ్యామ్, నాగరాజు, నాగేశ్వరరావు, కళాకారులు పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ నిర్వహించిన మయూఖ-2025 సదస్సులో అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎంబీఏ విద్యార్థులు మహ్మద్ నూరువుల్లా, నక్కా సాయిభరత్ ప్రతిభను చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. కళాశాల ఆవరణలో బహుమతులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డా.సువర్చల, అధ్యాపకులు పాల్గొన్నారు.


పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వర్ల, ఎమ్మెల్సీఅభ్యర్థి ఆలపాటి


మొవ్వలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, వర్ల కుమార్ రాజా

ఆలపాటికి ఘనవిజయం చేకూర్చాలి

పామర్రు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి పాటుపడేతత్వం ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కూటమి సర్కార్ బలపరచిన తనకు పట్టభద్రులు విజయాన్ని అందించాలని కోరారు. తాడిశెట్టి నరేష్, గొట్టిపాటి లక్ష్మీదాస్, వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ప్రిన్సిపాల్స్ పూర్ణచంద్రారెడ్డి, శ్రీనివాస్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** ప్రగతికి ఓటు వేసి సమాజాన్ని కాపాడాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి మొవ్వ జడ్పీ పాఠశాల, క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఓట్లు అభ్యర్థించారు. మండల టీడీపీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, వీరంకి తులసీదాస్, ఈడే నాగేశ్వరరావు, శీలం బాబురావు, నియోజకవర్గ పరిశీలకులు గుండు శ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకులు ఎన్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాకు ఘనవిజయం చేకూర్చాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఆలపాటి విజయం అవసరాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు వివరించారు. అభ్యర్థి ఆలపాటి రాజా, పార్టీ సీనియర్ నాయకుడు జక్కాశ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు విజయ్ కుమార్ సూచనలతో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మండలంలోని చిన్నపారుపూడి, జువ్వనపూడి, అప్పికట్ల గ్రామాల్లో తెలుగు మహిళలు ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మైనేని ఇందిరా, టీడీపీ నాయకురాలు నత్తా వాణి, యార్లగడ్డ లక్ష్మీ, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మైనేని ఇందిర

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటించని మండల పరిషత్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పుష్పరాణి అధ్యక్షతన జరిగింది. ఉద్యోగులు సమయ పాలన పాటించడంతో పాటు ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేసిన, సమయ పాలన పాటించని ఉద్యోగులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. శేరీగొల్వేపల్లి ఎంపీటీసీ సభ్యుడు అంగడాల రామాంజనేయులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించనందున ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో బి.వై. విష్ణుప్రసాద్‌ను కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు సక్రమంగా సేవలు అందించటం లేదని విమర్శించారు. గొల్వేపల్లి - గుంటాకోడూరు రహదారి వద్ద వంతెన కూలిందని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. గత మూడు సమావేశాలుగా సమస్య చెబుతున్నా పరిష్కరించలేదని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ పుష్పరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కా రానికి అధికారులు కృషి చేయాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఏ విషయాలైనా స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి అధికారులు తీసుకురావటం లేదన్నారు. పాఠశాలలు విలీనం విషయాలు చెప్పకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పశుసంవర్థక శాఖ జేడీ సిహెచ్.వి.నరసింహారావు మాట్లాడుతూ ప్రతీ వ్యవహారంలోనూ అధికారులు జాగ్రత్తలు తీసుకుని అభివృద్ధి పనులు చేయాలని కోరారు. అధికారులు, కార్యదర్శులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి ప్రారంభించాలన్నారు. ఎంపీడీవో బి.వై.వై.విష్ణుప్రసాద్, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి

మినుములో సమగ్ర సస్యరక్షణ

పామర్రు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మినుము పైరును ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ బి.స్వర్ణలత అన్నారు. అడ్డాడ, ఐనంపూడిగ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. తెగుళ్ల నివారణకు మోనోక్రోటోఫాస్1.6 మిల్లీలీటర్లు లేదా ఆసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకు పసుపు రంగులో మారుతున్నట్లు గ్రహిస్తే నివారణకు ఎసిటమాప్రిడ్ 0.5 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లేదాడైపెన్థియురాన్ 0.5 మిల్లీలీటర్ల ఒకలీ టరు నీటిలో కలిపి పైరుకు పిచికారి చేయాలని రైతులకు వివరించారు. ఏవో శివనాగరాణి మాట్లాడుతూ, రైతులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

గుడివాడ రూరల్: మినుము పైరు రైతులు తమకు ఇష్టం వచ్చిన షాపుల నుంచి ఏ మందులు పడితే ఆ పురుగు మందులు తెచ్చి పిచికారీ చేయడం సరికాదని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. మోటూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఊద, కలుపు నివారణ మందులు చల్లినా తగ్గలేదని కొందరు ఏడీఏ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారులు సూచించన మందులు మాత్రమే తగు మోతాదులో వాడాలన్నారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి


ఆర్థిక సాయం అందిస్తున్న వల్లూరుపల్లి రామకృష్ణ

అశ్వత్థనారాయణమూర్తి సేవలు అందరికీ ఆదర్శం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అడుసుమిల్లి అశ్వత్థనారాయణమూర్తి అందరికీ ఆదర్శప్రాయుడని అశ్వత్థనారాయణ మూర్తి ప్రైవేట్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రామకృష్ణ అన్నారు. అడుసుమిల్లి అశ్వత్థనారాయణ మూర్తి 38వ వర్ధంతిని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. వల్లూరుపల్లి రామకృష్ణ మాట్లాడుతూ గుడ్లవల్లేరు గ్రామ సమగ్రాభివృద్ధి, విద్యాసంస్థల ఏర్పాటు, పశువుల సంత ఏర్పాటులో అశ్వత్థనారాయణమూర్తి కృషిని మరువలేనిమన్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వల్లభనేని సుబ్బారావు, కొడాలి వెంకట కృష్ణారావు,అడుసుమిల్లి సుబ్రమణ్యేశ్వరరావు, ఉప్పలపాటి సత్యనారాయణ, పొట్లూరి రవికుమార్, జంగంమోహనరావు,డి. సురేంద్రబాబు, ఎస్.రాజశేఖర్, డాక్టర్ కరుణకుమార్, పి.రవీంద్రబాబు, డాక్టర్ ఎ.లక్ష్మణరావు, నారాయణం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బౌద్ధుల రాక నేడు

గుడివాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ముబారక్ సెంటర్ సమీపంలోని బౌద్ధస్థూపం వద్ద బుధవారం బుద్ధ పూర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్రీయ బౌద్ధ మహాసభ సభ్యులు పొంగులేటి జయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధుడు జన్మించి 2568 సంవత్సరాలు అయిన సందర్భంగా మాఘ పూర్ణిమ వేడుకలను బౌద్ధ స్థూపం వద్ద బౌద్ధుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ ఆర్.గంగాధరరావు, బౌద్ధ మహాసభ కోశాధికారి ఎ.వి రాజు, బౌద్ధగురువులు పాల్గొంటారన్నారు. అంబేడ్కర్ అభిమానులు, బౌద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిన్నమనేని నగర్‌లో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.15 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆదిలక్ష్మి కామేశ్వరి ఉత్సవాలు ప్రారంభం

పమిడిముక్కల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :కూడేరులో ఆదిలక్ష్మి కామేశ్వరి ఉత్సవాలు మంగళవారం వేద పండితుల మంత్రోచ్చరణ ల నడుమ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొ దటి రోజు విఘ్నేశ్వర, గోపూజ, మాతంగి పూజ, అనంతరం ఐనపూరులో కృష్ణానదీ పాయలో మృత్తికా స్నానాలు చేసి అమ్మవారి మూర్తులకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అఖండ దీపారాధన, మూల విరాట్టుకు స్నపన, 108 కలశాలతో అభిషేకం, అలంకారం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి కావూరి వంశీయులు తరలివచ్చారు.

రైతు కుటుంబానికి ఎమ్మెల్యే కుమార్‌రాజా పరామర్శ

పామర్రు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని దుర్మరణం చెందిన రైతు తాడిశెట్టి సుబ్రమణ్యం భౌతికకయాన్ని మంగళవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సందర్శించి నివాళుల ర్పించారు. రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతం రైతు పాడె మోస్తూ మోస్తూ శవయాత్రలో పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వార్డు మాజీ సభ్యుడు సాంబశివరావు, చాట్ల రమేష్, గ్రామ ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాలవెంకటరెడ్డి అల్లాడ రాజేష్, పానుగంటి సందిప్, ఎంపీటీసీ సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, తాడిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రమాదానికి గురైన ట్రాక్టర్

ట్రాక్టర్ ఢీకొని పీఏసీఎస్ కార్యదర్శికి తీవ్ర గాయాలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : యాకమూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నార్తువల్లూరు పీఏసీఎస్ కార్యదర్శి వలూరు డేవీ దయాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దయాకర్ బైక్‌పై ఉయ్యూరు నుంచి తోట్లవల్లూరు వస్తుండగా వెనుక నుండి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టి పంటబోదెలోకి బైక్‌తో సహా దూసుకెళ్లింది. దీంతో దయాకర్‌కు గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ వల్లూరు పవన్ ఎగిరి గట్టుపై పడటంతో గాయాలకు గురయ్యాడు. సీఐ చిట్టిబాబు వచ్చి బాధితులను 108 అంబులెన్స్‌లో ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికెన్ షాపుల తనిఖీ

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి కోళ్లను, గుడ్లను తీసుకురావొద్దని ఆదేశించిందని పశుసంవర్థక శాఖ జేడి నరసింహారావు అన్నారు. మంగళవారం రూరల్, అర్బన్ ప్రాంతాల్లో చికెన్ షాపు లు పరిశీలించారు. ఎక్కడి నుంచి కోళ్లను తీసుకొస్తున్నారో తెలుసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి విచ్చిన సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ జిల్లాల నుంచి కోళ్లను తీసుకురావద్దని తెలిపారు. గుడ్లను, కోళ్లను తీసుకురాకుండా కొన్ని రోజులు ఆపాలని సూచించారు. కోళ్ల నుంచి మనుష్యులకు కూడా బర్డ్ ఫ్లూ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున చికెన్, కోడిగుడ్లకు దూరంగా ఉండాలన్నారు. మండల పశుసంవర్థక శాఖ అధికారి ఉన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కూచిపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కోసూరులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏ డు గృహాలు దగ్ధం కాగా, పది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. మంగళవారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బాధిత కుటుంబాల వారిని పరామర్శించి ఆర్థిక సాయమందించారు. జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షులు దేవినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు, శేరీదగ్గుమిల్లి, కౌతవరం, పురిటిపాడు,వడ్లమన్నాడుల్లోని 27 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలతో మంగళవారం ఎంపీడీవో టి.విజయసారధి సమావేశం నిర్వహించారు. సుపోషిత పథకం అమలు అంశాలను వారికి వివరించారు. కేంద్రం నిర్వహణలో సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధికి పోస్టు కార్డుల ఉద్యమం

గుడివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలని కోరుతూ వేసిన కేసును వెంటనే విచారణ జరపాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో పోస్టుకార్డు ఉదమ్యాన్ని నిర్వహించారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమార్, ఉపాధ్యాయులు వి.ఎన్ కుమార్, వి.గోపిలకు ధన్యవాదాలు తెలిపారు. భద్రతా దళం సభ్యులు జి.పూర్ణచంద్రరావు, యమ్.డి తాహెర్ బాషా పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రైతు విశిష్ట సంఖ్య (పార్మర్ రిజస్ట్రీ) నమోదు కార్యక్రమాన్ని రైతులకు వివరించి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ లోకరాజు అన్నారు. వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ అసిస్టెంట్‌లకు రైతు విశిష్ట సంఖ్య గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యేక 11 అంకెల విశిష్ట సంఖ్య ఆధార్ కార్డు తరహాలో ఇస్తుందన్నారు. సొంత వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు తమ పొలం పాస్‌పుస్తకం, బి1 , ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ చేయబడిన ఫోన్ తీసుకొని గ్రామ రైతు సేవా కేంద్రాలలో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. అలా చేయించుకున్న వారికి మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరిచే పథకాలు పిఎం కిసాన్, అన్నదాత, సుఖీభవ వంటివి వివిధ సేవలు, రాయితీలు, పంట నష్టపరిహారాలు, గిట్టుబాటు ధరలు అమలవుతాయన్నారు. వ్యవసాయాధికారి సునీల్ పాల్గొన్నారు.

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.450

సింధు స్నానాలకు హంసలదీవిలో ఏర్పాట్లు పూర్తి

కోడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని సింధు స్నానాలు ఆచరించేందుకు హంసలదీవికి వచ్చే భక్తులకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో సుధా ప్రవీణ్ తెలిపారు. హంసలదీవి సముద్రతీరం వద్ద ఏర్పాట్లను ఈవోపీఆర్డీ నాగరేవతి పరిశీలించారు. స్నానాలు ఆచరించే భక్తులు రక్షణ కోసం పది మర బోట్లు, 60 మంది గజ ఈతగాళ్లు, నాలుగు వైద్య శిబిరాలు, నాలుగు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 150 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశామన్నారు. అవనిగడ్డ నుంచి హంసలదీవికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ బిక్షాలు, కార్యదర్శి లీలా ప్రియాంక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయుల మహోత్సవాల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు

తెలుగుభాష ఖ్యాతిని చాటిన మహోన్నతుడు శ్రీకృష్ణదేవరాయలు

ఘంటసాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహావిష్ణువు ఆదేశాను సారం తెలుగులో ఆముక్తమాల్యద గ్రంథాన్ని రచించడమే కాకుండా తెలుగుభాష ఖ్యాతిని నలుదిశాల చాటిన మహోన్నతుడు శ్రీకృష్ణదేవ రాయలు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ కృష్ణదేవరాయల మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఘననివాళులర్పించారు. తొలుత వేదపండితులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ఎంలు అనుపల్లవి భువనేశ్వరి, నాగబాబు, ఆలయ పర్యవేక్షకులు చెన్నకేశవ, అంగన్‌వాడీ టీచర్లు ఆదిరాల కనకదుర్గ, శివరాణి, పుష్పరాణి, ఆలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావడి సేవ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కార్తికేయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తైపూసం కావడిసేవ మహోత్సవం వైభవంగా జరిగింది. జిల్లా పరిషత్ సెంటర్‌లోని వినాయకుడి ఆలయం నుంచి బయలుదేరి ఊరేగింపుగా కావడిలతో భక్తులు రాబర్టుసన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయం వరకు తరలివచ్చారు. గుడివాడ ప్రణావశ్రమానిక చెందిన స్థైర్యానంద సరస్వతి స్వామి అభిబాషణం చేశారు. రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.



నాగిడి గాయత్రి, రాజేష్‌లను సత్కరించి నగదు బహుమతి అందిస్తున్న కూటమి నేతలు

నాగిడి గాయత్రికి ఘన సత్కారం

నాగాయలంక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జలక్రీడల పోటీల్లో స్వర్ణ పతాకాన్ని నాగిడి గాయత్రిని, తోటి జల క్రీడాకారుడు నాగిడి రాజేష్‌లను మంగళవారం నాగాయలంకలో కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తనవంతుగా రూ.10 వేలు నగదును కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్‌ల చేతుల మీదుగా అందజేశారు. తలశిల స్వర్ణలత, మండవ బాలవర్ధిరావు, లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, తుంగల కోటేశ్వరరావు, వర్రే రాంబాబు, బోనం పాపారావు, ఉప్పల ప్రసాద్, బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, చిట్టా అన్నపూర్ణయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో విజయకుమారి ప్రతిభ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయస్సు దాటినా జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో బందరు క్రీడాకారిణి తోట విజయ కుమారి ప్రతిభను చాటారు. సర్కారుతోటకు చెందిన తోట విజయ కుమారి రాజస్థాన్ ఆల్వాల్‌లో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెక్స్ పోటీల్లో లాంగ్‌జంప్, హేమర్ త్రో, 200 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించి పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా తోట విజయకుమారిని మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు.



ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేస్తున్న కొనకళ్ల, కాగిత

ఆలపాటిని గెలిపించాలి

పెడన రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు, నియోజకవర్గ జనసేన కన్వీనర్ పంచకర్ల సురేష్ కోరారు. నడుపూరు, కూడూరు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి తమ ప్రథమ ప్రాధాన్యతా ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి వీరప్రసాద్, శీరం ప్రసాద్, పామర్తి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ కోరారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో గోపీచంద్ పాల్గొని మాట్లాడారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, పివిఫణికుమార్ , ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ రాజశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగాయలంకలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. బొబ్బా గోవర్ధన్, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లిఖార్జునరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు మండవ బాలవర్ధిరావు, కొక్కిలిగడ్డ శివానందరావు, తుంగల కోటేశ్వరరావు, వర్రే రాంబాబు, తలశిల స్వర్ణలత, కొల్లూరి వెంకటేశ్వరరావు, లకనం నాగాంజనేయులు, ఉప్పల ప్రసాద్, లంకే శ్రీనివాస ప్రసాద్, నాగిడి తాతారావు, బోనం పాపారావు, మేడికొండ విజయ్, చిట్టా అన్నపూర్ణయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కోడూరు** : ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పట్టభద్రులు సంపూర్ణ మద్దతునివ్వాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ కోరారు. మండల టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తూర్పుకృష్ణా ప్రాజెక్టుకమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, వడుగు నాగబాబు, కోట రాంబాబు, సిద్దినేని అశోక్, మద్దూరి కాంతారావు, కొండవీటి రామకృష్ణ, పూతబోయిన శ్రీనివాసరావు, గుడివాక శివరాం,



కోడూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభిరామ్

ముద్దినేని చంద్రరావు, గోగినేని సోమశేఖరరావు, పెద్దసంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు. **మోపిదేవి** శాసనమండలి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు ప్రచారం ప్రారంభించారు. బొబ్బర్లంక గ్రామంలో ఇంటింటికి వెళ్లి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఆలపాటి రాజాను గెలిపించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుబేనడకుదుటి జనార్ధనరావు, గ్రామసర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, పార్టీ నాయకులు దొప్పలపూడి జగదీష్, రావి రత్నగిరి, చందన రంగారావు, బళ్లా సీతారామ ప్రసాద్, కోనేరు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గోదావరి జిల్లాల్లో వేదవ్యాస్ ప్రచారం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధిష్ఠానం సూచనల మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వేదవ్యాస్‌తో ఎమ్మెల్సీ భూమిరెడ్డి, రామ్‌గోపాలరెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవం

చల్లపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో విజయ వజ్రోత్సవాలు మండలంలోని ఊరూరా ఘనంగా జరిగాయి. చల్లపల్లి, యార్లగడ్డ, నిమ్మగడ్డ, నూకలవారిపాలెం, లక్ష్మీపురం, మేకావారిపాలెం, నిమ్మగడ్డ, నాదెళ్లవారిపాలెం, రామానగరం, పుచ్చగడ్డ తదితర గ్రామాల్లోని పాలకేంద్రాల్లో వేడుకలు జరిగాయి. పాలసొసైటీల పరిధిలో అత్యధికంగా పాలుపోసే పశుపోషకులకు ప్రోత్సాహక బహుమతులను అందజేసి సన్మానించుకున్నారు. సూపర్‌వైజర్ తమ్మన సురేష్‌కుమార్, సొసైటీల అధ్యక్షులు బెల్లం కొండ లక్ష్మి, బొబ్బా వెంకటేశ్వరరావు, చలమలశెట్టి వీరయ్య, పిల్లి లక్ష్మణరావు, మల్లుపెద్ది బోసు, మేకా వెంకట నరసింహారావు, మాలెంపాటి కోటేశ్వరరావు, వడ్లమూడి గోపీచంద్, తోట సుబ్బారావు, డొక్కు నాగార్జున తదితరులున్నారు. **పెడన** : కృష్ణాపురం గ్రామంలో మంగళవారం మిల్క్‌యూనియన్ వజ్రోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణామిల్క్ యూనియన్ పాలకవర్గసభ్యుడు అర్జా వెంకట నగేష్ పాల్గొని పాడి రైతులను ఘనంగా సత్కరించారు. 51 మంది కుక్కర్లు పంపిణీ చేశారు. ఫుడ్ కమిటీ సభ్యుడు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : కృష్ణా మిల్క్‌యూనియన్ వజ్రోత్సవాన్ని పాల ఉత్పత్తిదారుల సహకార కేంద్రంలో అధ్యక్షుడు తలశిల బాబురావు నేతృత్వంలో నిర్వహించారు. గత 30 సంవత్సరాల నుంచి పాలు పోస్తున్న భీమా సుబ్బారావు, కావూరి పాపారావు, కొల్లి శివరామ కృష్ణలను పాలక మండలి, సిబ్బంది ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు మిఠాయిలను పంచి పెట్టారు. **మోపిదేవి** : రావివారిపాలెంలోని పాల ఉత్పత్తిదారుల సంఘం వద్ద మిల్క్‌యూనియన్ వజ్రోత్సవాన్ని సంఘం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ ప్రప్రథమ అధ్యక్షుడు రావి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సంఘం అధ్యక్షులు రావి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులచే అధ్యక్షులుగా పని చేసిన వారిని, అధికంగా పాలు పోసిన రైతులను శాలువాలతో సత్కరించి మిఠాయిలు పంచారు. మోపిదేవి ఏరియా సూపర్‌వైజర్ మోర్ల వరప్రసాద్, గవిని శివరామకృష్ణ, రావి రామనాథ బాబు, బండి శ్రీను, రావి ప్రభు ప్రసాద్, వేములపల్లి పిచ్చేశ్వరరావు, అయ్యంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో విజయ వజ్రోత్సవంలో సూపర్‌వైజర్, తమ్మన సురేష్, సొసైటీ అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి



కృష్ణాపురంలో రైతులకు కుక్కర్లు పంపిణీ చేస్తున్న అర్జా వెంకట నగేష్



రైతులను సత్కరిస్తున్న బాబూరావు



రావివారిపాలెంలో పాల సంఘం అధ్యక్షులను సత్కరిస్తున్న నేతలు



సూర్యనారాయణను సత్కరిస్తున్న మండలి వెంకట్రామ్

కవి సూర్యనారాయణకు ఘనసత్కారం

నాగాయలంక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కవి, రచయిత జి.సూర్యనారాయణని కూటమి నేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. సూర్యనారాయణ రచించిన గోరువెచ్చని సూరీడు కవితా సంపుటికి జాతీయ స్థాయి పురస్కారం పొందిన నేపథ్యంలో సూర్యనారాయణను మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు దుశ్శాలువాతో సత్కరించారు. మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, లకనం నాగాంజనేయులు, బోనం పాపారావు, కోటేశ్వరరావు, బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు సూర్యనారాయణను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఆనపూజ

పెడన, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దేవాంగుల కులదైవం చౌడేశ్వరీ దేవి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున అగస్తేశ్వర ఆలయం వద్ద ఆనపూజ చేశారు. వందలాది మంది దేవాంగులు మేళతాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ బ్రహ్మపురంలోని చౌడేశ్వరీ దేవి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అగస్తేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు పారవశ్యంతో ఖడ్గాలు చదువుతుండగా ఆలయం ఎదుట ఆనకట్టారు. ఊటుకూరి ఏక్‌నాథ్ సుధీర్‌కుమార్, హేమకనకదుర్గనాగవాణి దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన విజయా అకాడమీ వాలీబాల్ బాలికల జట్టుతో ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, పీఈటీ అర్జునరావు

వాలీబాల్ విజేత విజయా అకాడమీ బాలికలు

చల్లపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రిగ్ మెమోరియల్ బాలికల జూనియర్ వాలీబాల్ పోటీలలో చల్లపల్లి విజయా అకాడమీ బాలికలు జిల్లాస్థాయి విజేతలుగా నిలిచారు. కెప్టెన్ యడ్ల కోమల శ్రీహాసిని, నల్లూరి లేఖన, మురాల దీక్షిత, శామీరుపేట జ్యోత్స్నశ్రీ, పాతూరి కుసుమాంజలి, నందియాల మేరీ గ్రేస్, దుట్టా రేష్మశ్రీ, కామరాజుగడ్డ అక్షయ అద్భుతంగా ఆడి విజేతలుగా నిలిచారు. విజేతగా నిలిచిన విద్యార్థినిలను, శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.అర్జునరావులను చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు అభినందించారు.

పులిగడ్డ సర్పంచ్‌కు మదర్ థెరెసా అవార్డు



అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌కు మదర్ థెరెసా సేవా పురస్కారం లభించింది. మదర్ థెరెసా అవార్డుకు ఎంపికైన విజయకుమార్‌ను గ్రామస్థులతోపాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనిత, పలువురు ప్రముఖులు అభినందించారు.



గతంలో కృష్ణవేణి విగ్రహం ఉన్న ప్రాంతం ఇదే

కృష్ణవేణమ్మ విగ్రహం మాయంపై భక్తుల ఆగ్రహం

కోడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి పవిత్ర కృష్ణ సాగర సంగమ ప్రదేశంలో ప్రతిష్ఠించిన కృష్ణవేణమ్మ విగ్రహం కనుమరుగయింది. 2016 కృష్ణా పుష్కర సమయంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సంగమ ప్రదేశంలో కృష్ణవేణమ్మ విగ్రహం కన్పించకుండా పోవడంపై అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మెరైన్, అటవీశాఖ అధికారులు కృష్ణవేణమ్మ విగ్రహం కన్పించకుండా పోవడంపై విచారణ జరిపి, విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని భక్తులు కోరుతున్నారు.

కలంకారీ డిజైన్లపై శిక్షణ

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పోలవరం గ్రామంలో స్నేహిత కలంకారీ యూనిట్ వద్ద హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సహకారంతో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం కొత్త రకాల డిజైన్లు, ఎర్త్ కలర్స్ ఫ్యాబ్రిక్ రంగుల అద్దకంపై యక్కల పీతాంబరధరరావు శిక్షణ ఇచ్చారు. చేనేత జౌళి శాఖ ఫీల్డ్ ఆఫీసర్ సుదీప్‌కుమార్ కలంకారీ కార్డులు, ట్రైనింగ్, ఎగ్జిబిషన్, రుణాల గురించి వివరించారు.న మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాసరావు, వాసవ్య మహిళా మండలి సభ్యులు లక్ష్మణ్, హాసిని, కలంకారీ కార్మికులు పాల్గొన్నారు.



బాలికల సెంట్రల్ జోన్ ఆటల పోటీలు ప్రారంభం

అవనిగడ్డ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దివి క్రీడాకారులను ప్రోత్సహించి నైపుణ్యాలను వెలికితీయటంలో వ్యాయామోపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ అన్నారు. బాలికల సెంట్రల్ జోన్ ఆటల పోటీలను బొబ్బా గోవర్దన్, రెడ్రోతు కృష్ణమోహన్‌తో కలసి ప్రారంభించారు. జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు ఎన్.మణి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్దన్ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు రెడ్రోతు కృష్ణబాబు భోజన సదుపాయం కల్పించారు. వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి గంగాధర్, దివి వ్యాయామోపాధ్యాయులు మారుతి, ఉదయ్, పూర్ణచంద్రరావు, సురేష్, మురళీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా 12వ తేదీ బుధవారం గూడూరులో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. గోవిందరాజులు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.



ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో రక్తదానం మిన్న అని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఏ.వాణిశ్రీ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ఆర్టీసీ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరాన్ని వాణిశ్రీ ప్రారంభించారు. మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు డిపోల సిబ్బంది, హెవీవెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న యువత రక్తదానం చేశారు. డిపో మేనేజరు పెద్దిరాజు, ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు శంకరనాథ్, ఆర్టీసీ డిస్పెన్సరీ డాక్టర్ ఎం.ఎస్. విజయసింగ్, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ శంకరరావు సేవలందించారు.



ఘంటసాలకు ఘననివాళి

ఘంటసాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతి సందర్భంగా ఘంటసాల కళా సమితి వద్ద ఆయన విగ్రహానికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఘంటసాల కళాసమితి కార్యదర్శి పోతన వెంకటేశ్వరరావు, బలే వెంకటేశ్వరరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.